క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఆదర్శనగర్ ప్రాంతంలో పలు చోట్ల సరఫరాకు అంతరాయం కలగనుంది. 33/11 కేవీ విశాలాక్షినగర్ సబ్ స్టేషన్, 11 కేవీ జూ పార్కు ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని పరిధిలో ఇందిరానగర్, రాజీవ్ నగర్, ఆదర్శనగర్ ప్రాంతాలలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

పారిశుధ్య కార్మికులకు మిఠాయిల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు మిఠాయిలు అందిస్తున్న చందు

బీచ్ రోడ్డు: జూనియర్ ఛాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ విశాఖ ప్రైడ్ చాప్టర్ ఆధ్వర్యంలో గురువారం సాగరతీరంలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు మిఠాయిలు పంపిణీ చేశారు. సెల్యూట్ టు సైలెంట్ స్టార్స్ పేరుతో నగరంలోని పారిశుధ్య కార్మికులకు స్వీట్స్ అందజేసి సత్కరిస్తున్నామని సంస్థ కార్యదర్శి కటకం చందు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అశోక్, సత్యనారాయణ పాల్గొన్నారు.

బీచ్‌లో స్వచ్ఛభారత్ రేపు

బీచ్‌రోడ్డు: ఇంటర్నేషనల్ కోస్టల్ క్లీన్ ఆఫ్ డేను పురస్కరించుకుని ఇండియన్ కోస్ట్‌గార్డ్, ఎకోలాస్టిక్ ప్రాడక్ట్స్ సంయుక్తంగా శనివారం సాగరతీరంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎకోలాస్టిక్ ప్రాడక్ట్స్ డైరెక్టర్ జితేంద్ర నిమ్మగడ్డ ఒక ప్రకటనలో తెలిపారు. దేశ వ్యాప్తంగా మూడు నగరాల్లో ఈ కార్యక్రమం జరగనుందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం పెద్ద సంఖ్యలో యువతీ యువకులు పాల్గొని తీర ప్రాంతాన్ని శుభ్రం చేయాలన్నారు. సముద్ర కాలుష్యానికి కారణమవుతున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా తీరం నుంచి తొలగించడం ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ



లబ్ధిదారులకు కొత్త పెన్షన్లు అందిస్తున్న 23వ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ

మద్దిలపాలెం : జీవీఎంసీ 23వ వార్డులో 56 మందికి కొత్త పెన్షన్లు మంజూరయ్యాయని స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ గుడ్ల విజయసాయి తెలిపారు. ఈ మేరకు కొత్త పెన్షన్లను మద్దిలపాలెంలో గురువారం వార్డు ఇన్‌చార్జి గుడ్ల సత్యారెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులు అందజేశారు. ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన వారందరికి కొత్త పెన్షన్‌లు మంజూరు చేశామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై డీఈవో ఆగ్రహం

సింహాచలం: విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన పెందుర్తి మండలం చింతలగ్రహారం జిల్లాపరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులపై డీఈవో చంద్రకళ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలను గురువారం ఆమె సందర్శించారు. తరగతుల నిర్వహణ, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. చదువులో విద్యార్థులు వెనుకబడి ఉండటాన్ని గుర్తించారు. వర్కు బుక్స్, నోట్ బుక్స్ దిద్దకపోవడాన్ని గుర్తించి ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. చింతల గ్రహారం ప్రాథమిక పాఠశాల, వేపగుంట, పెందుర్తి జిల్లా పరిషత్ హైస్కూళ్లల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు.

అరణ్యం నుంచి జనారణ్యంలోకి..



కంబాలకొండ కంచె దాటి రోడ్డు మీదకు వస్తున్న చుక్కల జింకలు (ఫైల్)



జాతీయరహదారి పక్కన వాహనాల శబ్దానికి పరుగులు తీస్తున్న చుక్కల జింకలు (ఫైల్)

- కంచె దాటి రోడ్డెక్కుతున్న జింకలు, దుప్పులు
- తరచూ ప్రమాదాలకు గురై మృత్యువాత

ఆరిలోవ: దట్టమైన అడవుల్లో తిరగాల్సిన వన్యప్రాణులు జనారణ్యంలోకి చేరుతున్నాయి. ఆకలి, దప్పిక కోసం అడవుల హద్దులు దాటేస్తున్నాయి. రహదారులపై తిరుగుతూ ప్రమాదాల బారిన పడుతున్నాయి. కొన్నిసార్లు ప్రాణాలు సైతం కోల్పోతున్నాయి. ఆరిలోవ ప్రాంతం చుట్టూ దట్టమైన కొండలున్నాయి. ఓ పక్క హనుమంతవాక నుంచి పైనాపిల్ కాలనీ వరకు ఆరు కిలోమీటర్లు పొడవున సింహాచలం కొండ, మరో పక్క జాతీయ రహదారిని ఆనుకుని డెయిరీ ఫారం, ఆదర్శనగర్, రవీంద్రనగర్, ఆరిలోవ కాలనీ, పైనాపిల్ కాలనీ వరకు సుమారు ఆరు కిలోమీటర్లు అభయారణ్యంతో కూడిన కంబాల కొండ వెనుక భాగం ఉంది. దీంతో పాటు డెయిరీ ఫారానికి సమీపంలో సీతకొండ ఉంది. ఆయా కొండల్లో నివసించే జింకలు తరచూ జనారణ్యంలోకి చేరుతున్నాయి. జాతీయ రహదారిపై కంబాలకొండల అంచున అటవీ శాఖ అధికారులు నిర్మించిన కంచె దాటి చుక్కల జింకలు బయటకు వచ్చేస్తున్నాయి. తాగునీరు, పచ్చిక కోసం వెతుక్కొంటూ ఆకలి బాట పడుతున్నాయి. కొండకు, రహదారికి మధ్యలో ఉన్న ఇనుప కంచె దాటి రోడ్డు మీదకు వచ్చి పక్కన ఉన్న పచ్చిక మేసి తిరిగి కొండల్లోకి వెళ్తున్నాయి. ఇలా నిత్యకృత్యంగా మారింది. ఈ జింకలు చెంగుచెంగున ఎగురుతూ రహదారిపై ప్రయాణించే వారికి కనువిందు కూడా చేస్తున్నాయి. కొందరు కార్లు, ద్విచక్ర వాహనాలు రోడ్డు పక్కన ఆపి వాటిని చూస్తూ ఆనందిస్తున్నారు.

ఇవీ ఘటనలు..

జాతీయ రహదారిపై ప్రయాణికులకు కనువిందు చేసే జింకలు ఒక్కోసారి ప్రమాదాల బారిన పడుతున్నాయి. ప్రశాంతమైన అడవుల నుంచి బయటకు వచ్చి వాహనాల రణగొణ ధ్వనులకు బెంబేలెత్తిపోతున్నాయి. ఎటు వెళ్లాలో తెలియక రోడ్డుపై అడ్డదిడ్డంగా పరుగెడుతూ వాహనాలకు అడ్డంపడుతున్నాయి. వాటిని తప్పించే క్రమంలో పలువురు వాహనచోదకులు కూడా ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. భారీ వాహనాలకు అడ్డంపడిన ఈ జింకలు ప్రమాదాల నుంచి తప్పించుకోలేక మృత్యువాత పడుతున్నాయి. గతంలో పదుల సంఖ్యలో కంబాల కొండ నుంచి ఎండాడ కూడలి వరకు జింకలు, అడవి పందులు వాహనాలకు అడ్డంపడి ప్రాణాలు కోల్పోయాయి. ఏడాది క్రితం జూ పార్కు ఎదురుగా ఓ జింక లారీకి అడ్డంపడి మృతి చెందింది. ఆరు నెలల క్రితం సీతకొండ నుంచి సముద్రంలో నీరు తాగడానికి వచ్చిన కనుజు అలలకు బలైపోయింది. గతేడాది సీతకొండ నుంచి విశాలాక్షినగర్‌లోకి చేరిన కనుజు మృత్యువాతపడింది. రెండేళ్ల క్రితం ఆరిలోవ కాలనీలో అర్ధరాత్రి సమయంలో కంబాలకొండ వెనుక భాగం నుంచి వచ్చిన ఓ కొండ మేక ప్రాథమిక పాఠశాలలోకి చేరి ఆ ప్రాంతంలో కుక్కల బారినపడి ప్రాణాలు కోల్పోయింది. ఇలా ఆహారం కోసం వచ్చి ప్రాణాలు కోల్పోతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు స్పందించి జనావాసాలను ఆనుకొని ఉండే కంబాలకొండల చుట్టూ పటిష్టమైన కంచె ఏర్పాటు చేసి భద్రత కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఏయూ సమాచారం

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన



వ్యక్తిత్వ వికాస పుస్తకం విడుదల చేస్తున్న అధికారులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు మాధ్యమం పాఠశాల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం–కెరియర్ గైడెన్స్‌పై గురువారం రాష్ట్ర ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలు, వ్యక్తిత్వ వికాసం, భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకునే మార్గాలపై నిపుణులు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కె.సలోమి, యువజన సర్వీసుల శాఖ అసిస్టెంట్ మేనేజర్ బి.ఎస్.ప్రకాశరావు, సూపరింటెండెంట్ ఎం.కె.సన్యాసిరావు, సీనియర్ అసిస్టెంట్ ఎస్.వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్



ప్రిన్సిపాల్‌ను సత్కరిస్తున్న విభాగ ఆచార్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గురువారం హిందీ దివస్‌ని ఘనంగా నిర్వహించారు. హిందీ విభాగ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకలను ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు ప్రారంభించారు. హిందీ భాష ఆవశ్యకతను వివరించారు. దేశంలో ఏ ప్రాంతానికి వెళ్లినా హిందీ భాష ప్రభావం ఉంటుందన్నారు. విభిన్న రాష్ట్రాల్లో పనిచేసే వారికి హిందీ భాష ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. మాతృభాషతో పాటు హిందీ భాషను నేర్చుకోవడానికి యువత ఆసక్తి చూపాలని, తద్వారా వారికి ఉపాధి అవకాశాలు విస్తృతమవుతాయని చెప్పారు. విభాగ ఆచార్యుడు ఎస్.సత్యనారాయణ హిందీ దివస్ ప్రాముఖ్యత, ప్రాధాన్యతను వివరించారు. అనంతరం ప్రిన్సిపాల్ నరసింహారావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య విజయ భారతి, వెంకటలక్ష్మి, సరోజిని, విభాగ పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ప్రతినిధులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించినట్లు యూనివర్సిటీ ఎంప్లాయ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ గైడెన్స్ బ్యూరో కె.దొరబాబు తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరైన వారిలో 68 మంది తొలిదశలో ఎంపికయ్యారని పేర్కొన్నారు. మౌఖిక ఇంటర్వ్యూలు జరిపి తుది ఫలితాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. తమ కేంద్రం నుంచి నిరంతరం జాబ్ మేళాలు నిర్వహిస్తామని, అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సంక్షేమ పథకాలే గెలుపునకు సోపానాలు

19వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులతో ఎంపీ ఎంవీవీ సమావేశం



18వ వార్డు పర్యటనలో స్థానిక నాయకులతో ఎంపీ ఎంవీవీ

ఎంవీపీ కాలనీ: లాసన్స్‌బే కాలనీలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 19వ వార్డు ముఖ్య నాయకులు, కార్యకర్తలతో విశాఖ ఎంపీ, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. 19వ వార్డులోని మత్స్యకారుల సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు బాటలు వేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ 19వ వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మి, సూరాడ దాసు, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, వార్డు ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

18వ వార్డు పర్యటనలో..

18వ వార్డు అప్పుఘర్ ప్రాంతంలో ఎంపీ ఎంవీవీ గురువారం ఉదయం పర్యటించారు. స్థానిక నాయకులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్యం, సీసీ రోడ్లు, ఆలయాల ఆధునికీకరణపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు ఇన్‌చార్జి పుక్కళ్ల ధనలక్ష్మి, శంకర్, పేర్ల విజయ చందర్, ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

మహారాణిపేట : ఆంధ్రా మెడికల్ కాలేజీలోని అనాటమీ బ్లాక్‌లో యాంటీ ర్యాగింగ్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ గురువారం జరిగింది. వైద్య విద్యలో కొత్తగా చేరిన విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ, ఏఎంసీ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రత్యేక సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ మాట్లాడుతూ ర్యాగింగ్ నిరోధక చట్టం గురించి విద్యార్థులకు అవగాహన ఉండాలన్నారు. ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండి విద్యను అభ్యసించాలన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి కె.వాణిశ్రీ, డీఎల్ఎస్ఏ ప్యానెల్ న్యాయవాది కె.అప్పలనాయుడు, ఏఎంసీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మన్మథరావు, సైకియాట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.మాధవీలత, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పీఎస్ఎన్ రాజు, అంబేడ్కర్ లా కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్‌వీకే ప్రసాద్, ఏఎంసీ అసిస్టెంట్ ప్రొఫెసర్ బంగారయ్య, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆగని ఆక్రమణ!

- గెడ్డను పూడ్చి రెండో ద్వారం ఏర్పాటు
- శ్రీసత్య ఆస్పత్రి నిర్వాకంపై ఆరిలోవవాసుల ఆగ్రహం



గెడ్డను కప్పేస్తున్న శ్రీసత్య ఆస్పత్రి నిర్వాహకులు

ఆరిలోవ: స్థానిక హెల్త్‌సిటీలో ఆస్పత్రులకు సుమారు 15 ఏళ్ల క్రితం అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం ఏపీఐఐసీ ద్వారా స్థలాలు కేటాయించింది. ఆయా స్థలాలు పొందిన యజమానులు ఆస్పత్రులు నిర్మాణాలు చేపట్టి నిర్వహిస్తున్నారు. ఇంకొన్ని ఆస్పత్రులు నిర్మాణ దశలో ఉన్నాయి. ఇక్కడ శ్రీసత్య ఆస్పత్రి నిర్వాహకులకు హెల్త్ సిటీలో ఆఖరు స్థలాన్ని ఆరిలోవ కాలనీ వైపు కేటాయించారు. ఆ స్థలంలో ఆస్పత్రి నిర్మాణం చేపట్టి గతేడాది నుంచి వైద్య సేవలు అందిస్తున్నారు. అంత వరకు బాగానే ఉంది. ఈ ఆస్పత్రికి వెనక భాగంలో ఆరిలోవ కాలనీ వైపు అనధికారికంగా రెండో ద్వారం తెరిచారు. ఈ ద్వారం నుంచి రోడ్డుకు రావడానికి మధ్యలో ప్రభుత్వానికి చెందిన సుమారు 200 చదరపు గజాలకు పైగా ఖాళీ స్థలం ఉంది. ఆ స్థలంతో పాటు దాన్ని ఆనుకుని ఉన్న గెడ్డను సైతం ఆస్పత్రి నిర్వాహకులు ఆక్రమించి డెబ్రిస్(గృహ వ్యర్థాలు)తో పూడ్చేశారు. దీంతో స్థలంతో పాటు గెడ్డ సైతం ఇక్కడ ఆక్రమణకు గురైంది. చదును చేసిన ఆ స్థలం నుంచి ద్వారం పెట్టి ఆస్పత్రి వాహనాల రాకపోకలకు వీలుగా సన్నాహాలు చేస్తున్నారు. 4 నెలల క్రితమే ఈ ఆస్పత్రి నిర్వాహకులు ఈ గెడ్డ లోపల కాంక్రీట్ వేసి గోడ నిర్మించే ప్రయత్నం చేశారు. ఈ విషయం తెలుసుకున్న రూరల్ రెవెన్యూ అధికారులు అప్పట్లో సచివాలయం సిబ్బందితో వెళ్లి నిర్మాణాన్ని నిలిపేశారు. ఆక్రమణకు పాల్పడవద్దని హెచ్చరించారు. పట్టువదలని విక్రమార్కుడు వలే మళ్లీ డెబ్రిస్‌తో గెడ్డను పూడ్చేశారు. ఆరిలోవ కాలనీ వైపు మార్గం లేకపోయినప్పటికీ ద్వారం తెరిచి ప్రభుత్వ స్థలం ఆక్రమణకు పూనుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఖాళీ స్థలంలో గ్రీనరీ ఏర్పాటు చేయాలని, లేదంటే సామాజిక భవనం నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సృజనాత్మకత పెంచే కార్యక్రమాలు అవసరం



తయారు చేసిన వినాయక ప్రతిమలతో విద్యార్థులు

ఏయూ క్యాంపస్: బాలల్లో సృజనాత్మకత పెంచే కార్యక్రమాలు నిర్వహించడం అవసరమని గాయత్రి విద్యా పరిషత్ ఉపాధ్యక్షుడు ఆచార్య దిట్టకవి దక్షిణామూర్తి అన్నారు. బీచ్‌రోడ్‌లో గాయత్రీ విద్యా పరిషత్ ఎంఎల్‌బీటీ పాఠశాలలో గురువారం జరిగిన వినాయకుని మట్టి ప్రతిమల తయారీ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మట్టి బొమ్మల తయారీ మంచి సృజనాత్మక కళగా అభివర్ణించారు. రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం, ఇంటరాక్ట్ క్లబ్, రాష్ట్ర ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ సంస్థ, ఏయూ చిత్రకళా విభాగాలు సంయుక్తంగా ఈ శిబిరాన్ని నిర్వహించాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ చేతులతో గణపయ్య రూపాన్ని తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో సంస్థ సంయుక్త కార్యదర్శి ఆచార్య ప్రగడ రాజగణపతి, ప్రిన్సిపాల్ కె.మధురవాణి, రోటరీ ప్రతినిధులు సూర్య, అంబిక, ఉగ్గిన శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. చిత్రకారులు సిహెచ్.మోహనరావు, విజయ్ మట్టి ప్రతిమల తయారీపై అవగాహన కల్పించారు.

జీవ వైవిధ్య వనం సందర్శన



ఉద్యానవనంలో ప్రభుత్వ కళాశాల విద్యార్థులు

ఏయూ క్యాంపస్: జీవ వైవిధ్య ఉద్యానవనాన్ని మధురవాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు గురువారం సందర్శించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కృష్ణవేణి, అధ్యాపకులు రవీంద్ర, డాక్టర్ అనీల్‌కుమార్, సైమండ్ పాల్‌లతో కూడిన విద్యార్థుల బృందం పార్క్‌ను సందర్శించి, మొక్కల విశేషాలను తెలుసుకున్నారు. ఉద్యానవనంలో ఉన్న వందలాది మొక్కలను ఆసక్తిగా తిలకించారు. వైవిధ్యత కలిగిన మొక్కల వివరాలను పార్క్ నిర్వాహకుడు డాక్టర్ మంథా రమణమూర్తి వివరించారు.

సమస్యల పరిష్కారానికి వినతి



ఎంపీ ఎంవీవీకి వినతి పత్రం అందిస్తున్న గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు పి.జె.గణేష్‌కుమార్, తదితరులు

మహారాణిపేట: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పి.జె.గణేష్‌కుమార్ కోరారు. ఈ మేరకు గురువారం లాసన్స్‌బే కాలనీలోని క్యాంపు కార్యాలయంలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను కలిసి వినతి పత్రం అందజేశారు. వార్డు పరిపాలన కార్యదర్శులపై పని భారం ఎక్కువైందన్నారు. ఇటీవల తమకు సంబంధం లేని పలు విషయాలపై సచివాలయ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు ఇచ్చారని వారు వాపోయారు. సచివాలయ ఉద్యోగులకు సెలవులు కూడా ఇవ్వడం లేదన్నారు. దీనిపై స్పందించిన ఎంపీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. యూనియన్ నాయకులు భార్గవ్ సుతేజ్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పార్చన నిర్వహిస్తున్న పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం ఏడుగంటల నుంచి స్వర్ణపుష్పార్చనని వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ బేడా మండపంలోని వేదికపై వేంజేంపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పఠిస్తూ 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు.సూపరింటిండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేటి నుంచి క్రీడా పోటీలు

సీతంపేట: విశాఖ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 14 నుంచి 17 ఏళ్ల వయసు గల విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ హెచ్‌ఎం శాంతికుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15, 16 తేదీల్లో మండల స్థాయి, 22, 23 తేదీల్లో నియోజకవర్గ స్థాయి పోటీలు జరుగుతాయన్నారు. 25వ వార్డు సీతంపేట మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమం నిర్వహిస్తామని, ఎన్‌జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ మైదానంలో పోటీలు జరుగుతాయని చెప్పారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రో బాల్, టెన్నీ కాయిట్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ పోటీల్లో సీతమ్మధార మండల స్థాయి, నియోజకవర్గ స్థాయిలోని అన్ని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలని ఆమె కోరారు.